క్లుప్తంగా

నేడు వారాహి అఖండ హోమం

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద గల బ్యాంకు కాలనీలో మంగళవారం సాయంత్రం నుంచి 90 గంటల పాటు నిర్విరామంగా వారాహి అఖండ హోమం జరగనుందని అక్షయ పాత్ర అధ్యక్షురాలు పోతురాజు కనక దుర్గ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే పూర్ణాహుతితో హోమం ముగుస్తుందన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ



రామాలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి రామారావుపేటలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఇచ్చిన రూ.10 లక్షలతో పాటు గ్రామస్తుల ఆర్థిక సహకారంతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ వరసాల చాముండేశ్వరి, ఎంపీటీసీ సఖిలే పద్మావతి, కలిదిండి కృష్ణంరాజు, జంపన వీర్రాజు, ఏలూరి ఆదినారాయణ, సఖిలే వెంకటేశ్వరావు, ఈత కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కాలువలోకి మురుగునీరు



భీమ్‌నగర్ వద్ద మంచినీటి కాలువలోకి కలుస్తున్న మురుగునీరు

యానాం: యానాం నల్లతూము నుంచి భీమ్‌నగర్ వరకూ గల మంచినీటి కాలువలోకి గత కొద్దిరోజులుగా మురుగునీరు ప్రవహిస్తున్నా సంబంధిత పీడబ్ల్యూడీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూకేవీనగర్ వద్ద మురుగునీటి కాలువ వెంబడి ఉన్న తుప్పలను కొంతమేర తొలగించారు. అయితే తొలగించిన తుప్పలను మురికినీటి కాలువలోకి పడేశారు. దీంతో మురుగునీటి కాలువ నీరు పక్కనే ఉన్న మంచినీటి కాలువలోకి వెళ్లిపోతుంది. అదే విధంగా భారీవర్షాల సమయంలో సైతం మురుగునీరు మంచినీటిలో కలిసిపోతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యభారతి వర్ధంతి



సుబ్రహ్మణ్యభారతి విగ్రహం వద్ద నివాళులర్పించిన ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త, తమిళ రచయిత చిన్నస్వామి సుబ్రహ్మణ్యభారతి వర్ధంతిని సమాచారశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రహదారిలో సుబ్రహ్మణ్య భారతి విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకవి భారతిగా ప్రాచుర్యం పొందిన సుబ్రహ్మణ్య భారతి చేసిన రచనలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత భావాలను వెలుగొందేలా చేశాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ



రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుడుపూడి శైలజ తదితరులు

ఉప్పలగుప్తం: పితృవియోగంతో బాధపడుతున్న సర్పంచ్ కరాటం లక్ష్మీప్రసన్నను రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కుడుపూడి భరత్‌భూషణ్ సోమవారం పరామర్శించారు. లక్ష్మీప్రసన్న తండ్రి నిమ్మకాయల రామారావు ఇటీవల మరణించడంతో మండలంలోని పెదగాడవిల్లిలో ఆమె కుటుంబీకులను పరామర్శించి, రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు కరాటం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఈ-పంట.. నమోదైతే నిశ్చింత..

- ముమ్మరంగా ఈ-పంట నమోదు
- ఈ నెల 15తో ముగియనున్న గడువు

తాళ్లరేవు: రైతులకు కొండంత అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. వాటిలో ప్రధానమైన ఈ-క్రాప్ నమోదు ద్వారా విత్తు నుంచి మొదలు ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించే వరకూ అన్ని రకాలుగా ఆసరాగా నిలుస్తుంది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఎవరు ఏ పంట సాగు చేశారన్న విషయాన్ని పరిశీలించి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతులకు పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా తదితర సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందేందుకు ఈ-క్రాప్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలు

ఈ-క్రాప్ నమోదైతే బ్యాంకుల ద్వారా సులువుగా పంట రుణాలు పొందొచ్చు. వైఎస్సార్ సున్నా వడ్డీకి అర్హత సాధించేందుకు వీలుంటుంది. ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమా పొందొచ్చు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటకు పరిహారం పొందవచ్చు. ధరల పతన సమయంలో సైతం కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంట నమోదు కాకుంటే ప్రభుత్వం ద్వారా అందే రాయితీలు, పరిహారాలు, లబ్ధి కోల్పోతారని వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.



చొల్లంగి పంచాయతీలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ బాబూరావు

రైతులందరూ నమోదు చేయించుకోవాలి



ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించి ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకూ గడువిచ్చింది. పంట సాగుచేస్తున్న రైతులందరూ వీలైనంత త్వరగా ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

– ఎస్.ప్రశాంతి, వ్యవసాయశాఖాధికారి, తాళ్లరేవు మండలం

ఈ-పంట విధానం బాగుంది



ప్రభుత్వం ప్రారంభించిన ఈ-పంట విధానం చాలా బాగుంది. ఈ-క్రాప్ ద్వారా నా పంటను యాప్‌లో నమోదు చేయడం వల్ల విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వడంతో పాటు పంట రుణం, ఏదైనా నష్టం జరిగితే నష్టపరిహారం కూడా అందిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– పలివెల సింహాచలం, రైతు, పోలేకుర్రు పంచాయతీ

ఏ సమస్యకైనా మరణం పరిష్కారం కాదు

అమలాపురం టౌన్: ఏ సమస్యకైనా మరణం పరిష్కారం కాదని, మనోధైర్యంతో సమస్య నుంచి బయటపడాలే తప్ప ఆత్మహత్య చేసుకోకూడదని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జరిగిన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న వ్యక్తిని వారి కుటుంబసభ్యులు, స్నేహితులు సకాలంలో గుర్తిస్తే వారిని ఆ ఆలోచనల నుంచి బయటపడేయొచ్చని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలపై చదువులపరంగా ఒత్తిడి పెంచకూడదని హితవు పలికారు. ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండాల్సిన అవసరముందన్నారు. ఆస్పత్రి సిబ్బందికి ఆత్యహత్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, సోషల్ వర్కర్ సీహెచ్ బాబి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మహత్యల నివారణ దినోత్సవ సభలో మాట్లాడుతున్న మానసిక వైద్యురాలు సౌమ్య

మరమ్మతుల నిమిత్తం రూ.8 లక్షల విరాళాలు

అమలాపురం టౌన్: స్థానిక ఏవీఆర్ నగర్‌లో ఉన్న స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ భవనం మరమ్మతుల నిమిత్తం కొందరు పెన్షనర్లు రూ.8 లక్షల విరాళాలు అందించడం అభినందనీయమని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పారుపూడి కృష్ణశాస్త్రి అన్నారు. స్థానిక అసోసియేషన్ భవనంలో సోమవారం జరిగిన జిల్లా అసోసియేషన్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు ప్రవేశపెట్టిన ఆర్థిక నివేదికను, భవనానికి మరమ్మతులు వంటి అంశాలను సమావేశంలో ఆమోదించారు. ఆదాయ పన్ను రికవరీ, న్యూరీజియం, ఓల్డ్ రీజియంలపై సమావేశంలో అవగాహన కల్పించారు. ఇటీవల మరణించిన అసోసియేషన్ సభ్యులైన పెన్షనర్లు ఆకుల కోటేశ్వరరావు, దుంగా గంగాధరరావు, నిమ్మన సత్తిరాజు, కె.భారతీసావిత్రి, నిమ్మకాయల సూర్య ప్రకాశం, కముజు వెంకటరెడ్డిలకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాద్, కోశాధికారి జేఎస్ శర్మ, మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, మెహబూబ్ షహీరా తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కృష్ణశాస్త్రి

బాక్సింగ్ కోచ్‌కు పీహెచ్‌డీ ప్రదానం



మధుకుమార్

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన బాక్సింగ్ కోచ్ బొంతు మధుకుమార్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ప్రదానం చేశారు. వ్యాయామ విద్యా విభాగంలో శరీర కూర్పు, కొవ్వు, అధిక రక్తపోటుపై మధుకుమార్ పీహెచ్‌డీ చేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులను ఎంపిక చేసుకుని ఈ పరిశోధనలు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవ సభలో మధుకుమార్‌కు ఈ అవార్డును అందజేశారు.

ప్రమాణ స్వీకారం చేసిన దొరబాబు

అమలాపురం రూరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా యాళ్ల వెంకట రామ్మోహన్‌రావు(దొరబాబు) ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, పార్లమెంటు జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్‌రావు తదితరులు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. పార్లమెంట్ జిల్లా బీజేపీ పదాధికారుల సమావేశం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడిగా తన పేరును సూచించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ పాలూరు సత్యానందం, ఆర్.వి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకటసుబ్బారావు, వల్లభనేని రవీంద్రబాబు, ఇళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న యాళ్ల దొరబాబు

కుంభకోణాల చంద్రబాబుకి శిక్ష తప్పదు

ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డారని, ఆయనకు శిక్ష తప్పదని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. పి.మల్లవరం పంచాయతీ ప్రత్తిగొందిలోని ఆయన స్వగృహంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదన్నారు. యువతకు ఉపాధి కల్పన పేరుతో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు షెల్ కంపెనీల ద్వారా పక్కదారి పట్టించడం వల్లే చంద్రబాబుకు ఈ గతి పట్టిందన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఈ అరెస్ట్‌తో నిరూపణ అయ్యిందన్నారు. చంద్రబాబుకు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ మద్దతు పలకం చూస్తుంటే పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. చంద్రబాబుకు వంత పాడడం మానేసి, తన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తే ఆదరణ పెరుగుతుందని హితవు పలికారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

మమ అనిపించారు

- టీడీపీ, జనసేన బంద్‌కు కానరాని కనీస స్పందన
- యథావిధిగా కార్యకలాపాలు కొనసాగించిన ప్రజలు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపుకు ప్రజల నుంచి స్పందన కరవైంది. టీడీపీ బంద్‌కు జనసేన పార్టీ మద్దతు తెలపడంతో కాసేపు ఆ రెండు పార్టీల నేతలు చేసిన హడావుడి తప్ప ప్రజలెవరూ పట్టించుకోలేదు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేతలు కొన్నిచోట్ల బలవంతంగా విద్యాలయాలు, దుకాణాలు మూయించి బంద్‌ను మమ అనిపించారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాలు పెట్టేసి పాఠశాలలను మూసేశారు. బ్యాంకులను కూడా నాయకులు బలవంతంగా మూసివేయించారు. మధ్యాహ్నం తరువాత టీడీపీ నాయకులు సైతం ఎక్కడా కనిపించలేదు.

అల్లవరం: అల్లవరం మండలంలో టీడీపీ శ్రేణులు మినహా ఎవరూ బంద్‌లో భాగస్వామ్యం కాలేదు. ఉదయం నుంచి వ్యాపార సముదాయాలు తెరిచే ఉన్నాయి. బస్సులు, ఆటోల రాకపోకలు యథావిధిగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు రోజూలాగే పనిచేశాయి. బంద్‌ని ఎవరూ పాటించకపోవడంతో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు డి.సత్తిబాబు ఆధ్వర్యంలో షాపులను మూయించారు. టీడీపీ నాయకులు మండలంలోని కొన్నిచోట్ల పాఠశాలలకు తాళాలు వేసి అత్యుత్సాహం ప్రదర్శించారు.

ఐ.పోలవరం: మండలంలో టీడీపీ బంద్ విఫలమైంది. మురమళ్ల, కేశనకుర్రు, ఐ.పోలవరం, పాతయింజరం, జి.వేమవరం గ్రామాల్లో నేతల ఒత్తిళ్లతో ఉదయం షాపులు మూసివేసినా మధ్యాహ్నం నుంచి యథావిధిగా తెరిచారు.

తాళ్లరేవు: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన బంద్ మండలంలో విఫలం కావడంతో టీడీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి దుకాణాలు, పాఠశాలలను మూసివేయించారు. సుంకరపాలెం జంక్షన్, కోరంగి వంతెనపై బైఠాయించి నినాదాలు చేశారు. అయితే వ్యాపారులు యథావిధిగా దుకాణాలు తెరిచి తమ కార్యకలాపాలు కొనసాగించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో బంద్ ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. టీడీపీ నాయకులు వ్యాపార దుకాణాలను, కార్యాలయాలను మూసివేయించే ప్రయత్నం చేశారు. ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో బంద్ విఫలమైంది.

ఉప్పలగుప్తం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 14 రోజులు రిమాండ్‌కు తరలించటంతో టీడీపీ చేపట్టిన బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. పలు గ్రామాల్లో ఉదయం 10:30 గంటల వరకూ వర్తక వ్యాపారాలు యథావిధిగానే జరిగాయి. అనంతరం టీడీపీ పార్టీ శ్రేణులు వచ్చి ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, చల్లపల్లి, భీమనపల్లి వంటి ప్రధాన సెంటర్లలో బలవంతంగా షాపులు మూయించినా వారు వెళ్లగానే తిరిగి తెరిచేశారు. మిగతా గ్రామాల్లో ఎక్కడా బంద్ ప్రస్తావనే లేదు. బంద్‌లో టీడీపీ పార్టీలో ఉన్న ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు సైతం పాల్గొనకపోవటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

కాట్రేనికోన: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కాట్రేనికోన మండలం వ్యాప్తంగా టీడీపీ నాయకులు చేపట్టిన బంద్‌ను ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో టీడీపీ నాయకులు షాపులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలను బలవంతంగా మూయించారు. అయినా కాసేపటికే దుకాణ సముదాయాలన్నీ యథావిధిగా తెరచుకున్నాయి.



అల్లవరంలో యథావిధిగా తెరచుకున్న వ్యాపార సముదాయాలు

చెలరేగిపోతున్న గ్రామసింహాలు

యానాం: పట్టణ పరిధిలో గ్రామసింహాలు చెలరేగిపోతుండడంతో పాదచారులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఫెర్రీ రహదారి, జిప్‌మెర్ సెంటర్, విద్యాలయం వీధి, త్యాగరాజవీధి తదితర రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శునకాలు స్వైర విహారం చేస్తూ దొరికినవారిని దొరికినట్లుగా కరిచేస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు పట్టపగలు తిరగడానికే హడలిపోతున్నారు. కేవలం కుక్కలకు భయపడి తల్లిదండ్రులు తమ చిన్నారులను పాఠశాలలకు పంపించాలంటేనే వణికిపోతున్నారు. తక్షణం మున్సిపల్ సిబ్బంది శునకాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రభుత్వ అతిథి గృహం వద్ద శునకాల స్వైర విహారం

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



రామకృష్ణ కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న స్థానిక నాయకులు

ముమ్మిడివరం: మండల పరిధిలోని కర్రివానిరేవులో గుండెపోటుతో మృతి చెందిన మత్స రామకృష్ణకు వైఎస్సార్ తక్షణ బీమా సాయంగా వచ్చిన రూ.10 వేలు వచ్చింది. ఆ నగదును రామకృష్ణ కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు, అధికారులు సోమవారం అందజేశారు.

సెక్షన్ 30 అమలు

అల్లవరం: అల్లవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సెక్షన్ 30 అమల్లో ఉందని ఎస్ఐ హరీష్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ముందస్తుగా డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం ఆర్జిత సేవగా స్వామి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డు ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కూడా కల్పించింది.



అంతర్వేదిలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

13న యువ కబడ్డీ సిరీస్ పురుషుల జట్టు ఎంపిక

రావులపాలెం: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే యువ కబడ్డీ సిరీస్‌కి పురుషుల జట్టు ఎంపిక ప్రక్రియ ఈనెల 13వ తేదీ బుధవారం రావులపాలెం కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ)లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొలుగూరి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక సీఆర్‌సీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. 13 తేదీ ఉదయం 9 గంటలకు సీఆర్‌సీలో జరిగే ఎంపికకు ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారుల బరువు 80 కేజీలు లోపు ఉండాలన్నారు. అలాగే వయసు 23 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9704063555, 9492099969 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. మడికి గ్రామానికి చెందిన బీసీ నేత యనమదల నాగేశ్వరరావు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్‌గా వెత్సా సురేష్ కుమార్, 14 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నామినేటెడ్ పోస్టుల కోసం ఛలో ఢిల్లీ

యానాం: పుదుచ్చేరిలోని ఎన్ఆర్‌కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన బోర్డుల్లోని నామినేటెడ్ పోస్టులు భర్తీ కాకపోవడం స్థానిక బీజేపీ నేతలను నిరాశకు గురిచేస్తుంది. 2021లో ఏర్పడిన ప్రభుత్వానికి ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు సైతం మద్దతుగా నిలిచారు. వారికి వివిధ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ పోస్టులను ఇవ్వాలని స్థానిక బీజేపీ నేతలు కోరుతున్నారు. అయినా ఇప్పటివరకూ ఎన్ఆర్ కాంగ్రెస్ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో పలువురు నేతలు నేరుగా ఢిల్లీ వెళ్లి బీజేపీ అధిష్ఠానానికి ఫిర్యాదుచేయాలని నిర్ణయించినట్లుగా సమాచారం. కొద్దిరోజుల క్రితమే పుదుచ్చేరి వచ్చిన బీజేపీ స్టేట్ ఇన్‌చార్జి నిర్మలకుమార్ సురేనా బీజేపీ, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలతో చర్చించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అందరినీ కలుపుకుని వెళ్లాలన్నది ఆయన ఆలోచన.. ఈ మేరకు బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో సమావేశమై అక్కడ నుంచి సీఎం రంగసామితో మాట్లాడించాలని నిర్ణయించారు.

పోటీ పరీక్షల తేదీల ప్రకటన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్షల తేదీలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ కార్యదర్శి జయశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు పరీక్ష అక్టోబర్ 10, ఆరోగ్యశాఖ నిర్వహించే థియేటర్ అసిస్టెంట్ పోస్టుకు, పోలీస్‌శాఖ నిర్వహించే డ్రైవర్ (గ్రేడ్–3) పోస్టుకు అక్టోబర్ 15, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ నిర్వహించే ఫీల్డ్ సర్వేయర్ పోస్టుకు, ట్రాన్స్‌పోర్టు శాఖ నిర్వహించే ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు అక్టోబర్ 22న రాతపరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్ల డౌన్‌లోడ్, పరీక్షా కేంద్రాల గురించి త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు



పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. వై.కొత్తపల్లి వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేటకు చెందిన పి.కిరణ్ ఆర్థిక సాయంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, డాక్టర్ పి.కోటేశ్వరరావు, నాయకులు నల్లా పెదకాపు, రావూరి సత్యనారాయణ, నేలపూడి రామకృష్ణ, తోరం సూరిబాబు, ఆకాశం చిట్టిబాబు, కొర్లపాటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.